# జాతక కథ

నాకు ఈమధ్య రోజులు బాగులేవు. మంచి జ్యోతిష్కుడు ఒకాయన మా ఊరు వచ్చేడని నా స్నేహితుడు రెడ్డి చెప్పాడు. రెడ్డికి రోజులు బాగున్నాయి. అటువంటివాళ్లు జాతకాలు చూపించుకోవలసిన అవసరం లేదు. కాని, అతనికి ఇంతగా అంతగా అల్లంతగా పెద్దవాణ్ణయి పోదామనే కోరికా, జాతకాలమీద ఎంతో నమ్మకమూ ఉన్నాయి. జాతకం చూసేవారికి ఎవరికైనా సరే అతను తన జాతకచక్రం చూపిస్తాడు. అతనికి రాజయోగాలు చాలా ఉన్నాయని వారందరూ చెప్పారు. అతని యోగం కూడా అలా వారు చెప్పినట్టుగానే ఎంతో చక్కగా ఉంది. దాంతో నాక్కూడా జాతకాలమీద ఈమధ్య తిరిగి నమ్మకం కుదిరింది.

నేనూ రెడ్డీ ఓసారి ఓ జ్యోతిష్కుడి దగ్గరికి వెళ్లేం. అతను "రెడ్డిగారి" జాతకం చూసి అతణ్ణి ఆకాశానికి యెత్తేసేడు. రెడ్డి చాలా గర్వించేడు. ఆ జాతకుడు నా జాతకం చూసి ఓ పెదిమె విరిచేడు. ఆ తరవాత అబ్బే అన్నట్టుగా నా జాతకాన్ని చూసి చప్పరించేడు. ఆఖరికి నా జాతకం చదివి నన్ను భూమట్టం చేసేసేడు. రెడ్డికి నా జీవితపు నిజమైన నిత్య జాతకం బాగా తెలుసు. నా విషయంలో నిజం చెప్పగలిగిన జాతకుడు తన విషయంలో నిజం చెప్పే వుంటాడని అతనికి బాగా నమ్మకం కలిగిందనుకుంటాను. అతను చాలా ఆనందించేడు. నాకు అర్థం అయింది. అతను చాలా గర్వించేడు. నాకు అర్థం అయింది.

నాకు జాతకాల మీద నమ్మకం పూర్తిగా ఎప్పుడూ పోలేదు. ఆశ ఉన్నంతకాలం నమ్మకం పోదనుకుంటాను. ఇద్దరు ముగ్గురు జ్యోతిష్కులు నా జాతకం కూడా బాగానే ఉందన్నారు. నాకు శుక్రుడు చాలా బావున్నాడన్నారు. రెడ్డికి రవి బాగున్నాడన్నారు.

రవి గవర్నమెంటు గ్రహంట, అంటే మంచి మంచి అధికారాలిస్తాట్ట. మంచి హోదా ఇస్తాట్ట. శుక్రుడు మంచి మంచి సౌఖ్యాలూ సరదాలూ ఇస్తాట్ట. "డబ్బు లేని సరదా అదేం సరదా?" అని అడిగేన్నేను. అంటే జ్యోతిష్కుడు చెప్పేడు, "రెడ్డిగారికి లక్ష రూపాయల ఉద్యోగం రావచ్చు, మీకు లక్ష రూపాయలు గల స్త్రీతో సౌఖ్యం మాత్రం రావచ్చు. తేడా తెలిసిందా?" తేడా తెలిసింది నాకు. కాని, జాతకులందరికీ ఆ సౌఖ్యమే కాకుండా ఆ లక్ష రూపాయలూ కూడా కావాలని వుంటుంది. స్త్రీ సౌఖ్యం స్త్రీ సౌఖ్యమే, లక్ష రూపాయల సౌఖ్యం లక్ష రూపాయల సౌఖ్యమే.

బర్కిలీ పెట్టె కొనుక్కోందికి అర్ధ రూపాయి సౌఖ్యం లేనప్పుడు జాతక చక్రమ్మీద చిరాకు వేస్తుంది. అటువంటి సమయాల్లో జాతకం ముందు ముందుకి బావుంటుందని ఎవరైనా చెప్తే మాత్రం ఆ జ్యోతిష్కుడి మీదనమ్మకం కుదురుతుంది.

చాలాకాలం కిందట నేను కాణీకి రెండు మార్కు సిగరెట్లే కాల్చేవాణ్ణి. ఇపుడు శని

మహాదశ చిక్కుల్లో ఉన్నట్టే అప్పుడు రాహు మహాదశ రాపిడిలో ఉండేవాణ్ని. ఆ రాపిడి రోజుల్లోనే ఓ రోజున నాకు నా జాతకం చదివింపించుకుందామనే అభిలాష తొలిసారిగా కలిగింది.

సాయంకాలపు చీకట్లో మా అమ్మ కాకరకాయలు కాబోలు తరుగుతోంది. "అమ్మా! నా జాతక చక్రం ఉండాలి కదమ్మా?" అన్నాను. "ఉందిరా నాయనా! ఏదీ ఓసారి తీసిద్దూ. మంచి జ్యోతిష్కుడొచ్చేట్ట. ఫ్రీగా చూస్తాట్ట. "కూర తరిగేక తీసిస్తానుండు".

కూర తరిగేసరికి బాగా చీకటి పడింది. మా అమ్మ ఓ సందుగు పెట్టెలోంచి ఓ పాత కాయితం వెతికి తీసిచ్చింది. "అదేరా నీ చక్రం, పట్టుకువెళ్లు" అంది మా అమ్మ. పట్టుకువెళ్లేను.

జ్యోతిష్కుల్లో రకరకాలున్నాయి. కొన్నింటివి మాసిన గడ్డాలు, మరి కొన్నింటివి బాగా గీసిన గడ్డాలు. (మాసిన గడ్డాలవాళ్లే జాతకాలు బాగా చూస్తారని నేను కొన్నాళ్లు ఓ అభిప్రాయంతో ఉండేవాణ్ని). ఆ జ్యోతిష్కుడిది నున్నగా ఉన్న ముఖం. అతను బాగా ముస్తాబయి వున్నాడు. అతను సాయంకాలం శుభ్రంగా స్నానంచేసి ఏదో అత్తరు రాసుకున్నట్టుగా కూడా నాకు తోచింది. పార్కు లైటు వెలుగులో పచ్చగడ్డి మీద కూర్చున్నాడు. అతనికి నలభయ్యేళ్ల వయసు అప్పటికి ఉండి ఉండవచ్చును. కాని ఆ రోజుల్లో నలభైకీ యాభై అయిదుకీ మధ్య వయసులో తేడా నేను చెప్పలేక పోయేవాణ్ణి. తెలుసుకోలేక పోయేవాణ్ణి. అతను కట్టుకున్న పంచె పాలరంగులో ఉంటే, అతను తొడుక్కున్న జుబ్బా జిలేబి రంగులో ఉంది. జరీ ఖండువా కర్పూరపు దండలా ఉంది. అతని ముఖం కలువల్ని చూసి వెలిగే నెలరాజులా ఉంది, అతనికి కొంచెం దూరంలో కొన్ని మిడిల్ క్లాస్ ముదురు కలువలు కూర్చొని ఉన్నాయి కూడాను.

అప్పటికి ఇంకా మా రెడ్డి నాకు స్నేహితుడవలేదు. కొండకర్ల పంతులుగాడనే పేరుగల అప్పడు పంతులు నాకు ఓ ఏడాది జూనియర్‌గా చదువులోనూ, రెండేళ్లు సీనియర్‌గా వయసులోనూ ఉండి నాకు స్నేహితుడుగా ఉండేవాడు. జ్యోతిష్కుడి పేరు చలపతిరావను కుంటాను. వయసులో తనకంటె ఎంతో పెద్దే అయినప్పటికీ ఆ జ్యోతిష్కుడితో చనువుగా వుండేవాడు మా అప్పడు పంతులు. పంతుల్నీ, వాడి విధవక్కనీ చలపతిరావు సినిమానించి ఇంటికి దిగబెడుతూండేవాడు. పంతులు గాడి విధవక్కకూడా జాతకాల సరదా ఉండేది. జాతకాల గురించి ఆవిడా, చలపతీ కేకలు వేసుకొంటూ సరదాగా మాట్లాడుకొనేవారు. ఆవిడ వైధవ్యానికి కారణం కుజదోషం అని చలపతి చెప్పేవాడు. తన భర్తని నీచ శుక్రుడు నట్టేట్లో కలిపేడే కాని దోషకుజుడి పాపం పాలు అందులో ఏమీ లేదనేది ఆవిడ. వారిద్దరిదీ ఆ జాతకాల సరదా అపుడు పంతులుక్కూడా అంటుకుంది. వాడు నన్ను రెచ్చగొట్టి నా జాతకం తవ్వింపించి తీయింపించి చలపతి చేతిలో పెట్టేడు.

పార్కు లైటు మసక వెలుగులో చలపతి నా జాతకం చూసి "భేషా" అన్నాడు. ముదురుకలువల గుంపులోంచి ఓ ఇరవై నాలుగు నెలల బాలుడు నడుమకొంటూ వచ్చి చలపతి కండువా లాగాడు. ఆ బాలుడి మేనత్తో, పెత్తల్లో కాబోలు "భడవాకానా" అంటూ వడివడిగా పుస్తెలూ హారాలూ, గాజులూ, చప్పుడు చేసుకొంటూ వచ్చి ఆ బాలుణ్ణి గుండెలకి

హత్తుకొని ముద్దాడుకొంటూ కలువల సమూహంలోకి వెళ్లింది. చలపతి "భేష్"ని నేను అప్పట్లో శంకించలేదు.

చలపతి మళ్లీ మరో భేష్ కొట్టి. ఏఁవిఁటయ్యా నీ పేరు? వెంకట సత్యవాఁ? రైటో! అయితే మరి మిస్టర్ సత్యం, జాతకం చూసి నీకేం చెప్పమంటావో చెప్పు అన్నాడు. "ఏం చెప్తారో మీరే చెప్పండి" అన్నాన్నేను. "నీకేం కావాలి? చదువా, డబ్బా, అందమైన పెళ్లాఁవాఁ ఎ హ్హె హ్హె ఏం కావాలయ్యా నీకు?" అని నావైపు నవ్వుతూ చూసి ఆ నవ్వుని కలువల మీదికి కూడా ప్రసరించేడు చలపతి ఈలోగా (24) నెలల బాలుడు మళ్లీ దగ్గరికి రావడం, పుస్తెలూ, హారాలూ, గాజులూ మరోసారి బాలుణ్ని లాక్కుపోడమూ జరిగేయి.

చలపతి ప్రశ్నకి నేను ఆలోచిస్తూ కూర్చున్నాను. నాకేం గావాలి? చదువా? ఆఫ్‌కోర్సు, డబ్బా! ఆఫ్‌కోర్సు. పెళ్లాఁవా!

"పెళ్లి లేకుండా ప్రేమ మాత్రం గావాలా! చెప్పవయ్యా!....... పిల్లణ్ని ఉణ్నియ్యండి. ఏం బాబూ నీ పేరేఁవిఁటి? నీకు నేను కావాలా? ఆవిడ కావాలా? - మీవాడు ముద్దుగా సుభాస్‌బోస్‌లా వున్నాడండీ. నాకు పెంచుకొందికి ఇచ్చేయండి, ఇవ్వరా, పోన్లెండి! - జాతకం ఉందా? చూస్తానివ్వండీ, నేను చూడగల్నే! - కొత్తవాణ్ణేం కానున్కండి..... మిమ్మల్ని నాకు తెలుసు. రెడ్డిపిల్లి అగ్రహారం కదూ మీది? సూరప్ప మా పెద్దత్తగారు - వెంకప్ప కూతురే మా ఆవిడ!"

వెంకప్ప కూతురే చలపతి భార్య అని తెలిసేసరికి ముదురు కలువల్లో కలకలలు బయలుదేరింది. మా దగ్గర్నుంచి లేచి అక్కడికి వెళ్లి అత్తయ్యలతోనూ, వదినెలతోనూ, మరదళ్లతోనూ, మేనగోడళ్లతోనూ చలపతి మాట్లాడి వాళ్లందరికీ తను వచ్చి తీరు .ని వాగ్దానాలు చేసి తిరిగి మా దగ్గరికి వచ్చేసరికి అరగంట పట్టింది.

ఆడవాళ్లని లాగడానికి కొంతమంది పాటా ఆటా ఎరగా వేస్తారు. కొంతమంది వేష భాషల్ని ఎరగా ఉపయోగిస్తారు. కొంతమంది కథలు రాసి వాటిని ఎరగా విసురుతారు. అందు గురించి కొంతమంది ఒట్టి వయసుమీదే ఆధారపడతారు. చలపతి మాత్రం జాతకాలు చదివి నెరజాణల్ని మెప్పించేవాడని ఆ తరువాత తెలిసింది నాకు. ఎవరి ఎరలు వారివి. మా వూళ్లో ఓ గొప్ప వేదాన్తిగారు ఉపనిషత్తులన్నీ ఉపదేశించి ఓ పెద్ద రాణీగార్ని లొంగదీసుకొన్నారు. అందుకే నాకు అనిపిస్తూ వుంటుంది. ఆడవాళ్ల విషయంలో అన్ని వేదాంతాలూ ఆఖరికి శయ్యా గృహానికే పయనం చేస్తాయనీ, పందిరి మంచం మీదికే పరుగులు తీస్తాయనీ.

ఆనాడు చలపతి పంచె సర్దుకొంటూ ఝుమఝుమ లాడుతూ మా దగ్గరికి వచ్చి నా జాతక చక్రం చూడకుండా ముదురు కలువల గురించి కొండకర్ల పంతుల్తో కొంతసేపు ముచ్చటించేడు. ఆ రెడ్డిపిల్లి అగ్రహారపు రమణీమణులంతా తన విధవక్క అత్తవారి ద్వారా తనక్కూడా బంధువులేనని చలపతి వల్ల తెలుసుకొన్నాక మా పంతులుగాడు కూడా కొంతసేపు పరవశించిపోయేడు. నా జాతకం చదివించుకుందామనే సరదాలో ఉన్న నేనుమాత్రం వాళ్ల పరవశాలకి దూరంగా ఉండిపోయేను.

ఎట్టకేలకి చలపతి నా జాతకం (పార్కు లైటు వెలుగులో) చూచి

"ఏఁవిఁటోయ్, వెంకటేశం! నీకు మంచి పెళ్లాం ఎప్పుడొస్తుందనా అంటావు!" అన్నాడు. నాపేరు వెంకటేశం కాదు. పెళ్లాం కావాలని నే ననలేదు.

"దేనిగురించి అడిగేవు? ఏంకావాలి నీకు? చెప్పవయ్యా చెప్పు!" అన్నాడు చలపతి నా జాతకం చూస్తూ.

డబ్బు గురించి, పెళ్లాం గురించీ అడగడానికి నాకు మొహమాటం వేసింది. మేం చిక్కుల్లో ఉన్నామని చెప్పడానికి మొహమాటం వేసి ఆ సంగతి గురించి కూడా అడగలేదు నేను. ఆలోచించి ఆలోచించి,

"నేనెంతకాలం బతుకుతానో చెప్పండి" అన్నాన్నేను చాలా అమాయకంగా కనిపించాలని.

"గొప్ప ప్రశ్నే వేసేవయ్యా! చెప్తానుండు" అని కొంచెంసేపు జాతకం చూసి, కాయితం దించి, నావైపు చూసి.

"నీకు చావులేదయ్యా!" అన్నాడు చలపతి. "నువ్వు వెయ్యేళ్లు బతుకుతావు. ఎలా బతుకుతావు? రాయిలా బతుకుతావు. నీట్లో వేస్తే నానవు. నిప్పులో వేస్తే కాలవు. నీకు రొంప పట్టదు. జ్వరం తగల్దు. నువ్వు మందు తాగవు. ఏనుగొచ్చి గుద్దితే అమ్మా అనవు. రాయిలా బతుకుతావు" అని వివరించి కూడా చెప్పాడు చలపతి.

ఎక్కువకాలం ఆరోగ్యంగా బతుకుతావులే అంటే సరేనంటాను. కాని, "రాయిలా బతుకుతావు" అంటే నాకెందుకో కష్టం తోచింది. రాయిలా బతకడం మహారాజయోగంలా ధ్వనించలేదు నాకు, కాని ఏంచేస్తాం? బతగ్గలగడమే మహాభాగ్యం అయినప్పుడు పువ్వులా బతికితేనేమిటి, రాయిలా బతికితేనేమిటి?

ఏమైనప్పటికీ నేను వెయ్యేళ్లు బతుకుతానని చలపతి చెప్పినందువల్ల నాకు పెద్ద సంతోషం కలగలేదు. పోనీ నేను ఎంతవరకూ చదువుతాను. ఏం ఉద్యోగం చేస్తాను అనే విషయాలు తెలుసుకుందామనుకున్నాను.

"ఏఁవండీ! నేనెంతవరకూ చదువుతానండీ?" అని, నా రెండు ముణుకులూ నా రెండు చేతుల్తో పెనవేసి పట్టుకుని బుద్ధిగా అడిగేన్నేను.

చలపతి నా జాతక చక్రాన్ని బిగించి పట్టుకుని తీక్షణంగా చూస్తున్నాడు. అతణ్ని నేనేదో డిస్టర్బ్ చేసినట్టుగా "ఉండు!" అని గద్దించేడు నన్ను.

"ఉంఁడ్రా! సరిగ్గా చూణ్నీరా!" అని నన్ను మందలించేడు కొండకర్ల పంతులు.

చలపతి గద్దింపుకీ, పంతులుగాడి మందలింపుకీ భయపడి, నేరం చేసినవాళ్లలా అలా కూర్చుని అతనేం చెప్తాడా అని చూస్తున్నాను.

చలపతి నా చక్రంలోకి అలా చూస్తూనే "వెంకటేశవాఁ? వెంకట సత్యవా?" అని అడిగేడు.

నేను వెంకటేశాన్ని కాననీ, వెంకట సత్యాన్ననీ చలపతికి మా పంతులుగాడు తెలియ జేసేడు.

"ఎప్పుడు పుట్టేవూ? దుందుభిలో కదూ? రైట్. దుందుభి శ్రావణ శుద్ధ ఏకాదశి! రైట్" అన్నాడు చలపతి.

నాకు అదేమిటో బోధపడలేదు. ప్రశ్నార్థకంగా పంతులుగాడి వైపు చూసేను.

"నువ్వెప్పుడు పుట్టేవో చెప్తున్నారు. దుందుభి నామ సంవత్సరంలో పుట్టేవుట" అన్నాడు పంతులు.

"పందొమ్మిది వందల ఇరవై రెండు ఆగష్టులో పుట్టేను" అని నేను భయపడుతూ చెప్పాను. ఎందుకు భయపడ్డానో మాత్రం చెప్పలేదు.

"ఇంగ్లీషు ప్రకారం అంతే అవుతుంది" అన్నాడు పంతులు.

మా సంభాషణ కట్‌చేస్తూ చలపతి నా చక్రంలోంచి బ్రేక్ అవుట్ అయేడు.

"సత్యం! మీ నాన్నేం చేస్తున్నాడు?" అని నావైపు కొంచెం వంగి మఠం మారుస్తూ, పంచె సర్దుకొంటూ అడిగేడు చలపతి.

"వాడి నాన్నని వాడెరగడే! ఎప్పుడో కునికీసేడతను" అని చలపతికి చెప్పేడు పంతులు.

"విజయసూచకమైన" నవ్వు నవ్వేడు చలపతి, "హందుకే అడిగేన్రా న్నాయనా" అని ట్రయంఫెంట్‌గా అన్నాడు.

"ఎప్పుడు చచ్చిపోయేడు? నువ్వు పుట్టిన ఏడాది తిరక్కుండా ఎగిరిపోయుండాలి" అన్నాడు చలపతి.

నే నాశ్చర్యపోయేను. కరక్టే! నేను ఆర్నెల్లవాణ్ని, మా నాన్న చచ్చిపోయేడు.

చలపతి యెడల నాకు భయమూ, భక్తీ ఎక్కువయేయి. నా చక్రం లోంచి అతను తెలుసుకున్న సంగతి నిజమేనని ఆయనకి తెలియజేసేన్నేను.

తను కరెక్టుగా తండ్రి చావుగురించి చెప్పగలిగినందుకు చలపతిగారు పంతులు గారి వైపు చూస్తూ నవ్వుతూ తల ఆడిస్తూ "నరననన్ననవా, నారన నన్న ననా నర నన నన్నానన!" అని పాడి, "ఎలా చెప్పానో చెప్పుకోరా పంతులూ చూదాం" అంటూ పంతులు మీదికి నా జాతకచక్రం గిరవాటి వేసేడు.

పంతులు పట్టుకుచూసే ఆ కాయితంలోకి నేనుకూడా చూసేను. నా తండ్రి మృత్యువుతో సహా నా జీవితాన్నంతా దాచుకున్న ఆ పాత కాయితంలోని గీతల్నీ, అక్షరాల్నీ చూసి నాకు భయం వేసింది. ఆ కాయితంలో ఇంకెన్ని చావులున్నాయో, ఇంకెన్ని కష్టాలు, దుఃఖాలు, కన్నీళ్లు ఏమున్నాయో కదా! ఏ కత్తుల కోతలు, ఏ నెత్తుటి ధారలు ఏమేమి ఉన్నాయో కదా అని నాకు చాలా భయం వేసింది.

చలపతీ, పంతులూ మా నాన్న మరణం గురించి కొంతసేపు చర్చించేరు. పంతులుగాడి బావగార్ని కుజుడెలా ఎగరగొట్టేడో అలానే మా నాన్నని మరెవరో (నాకిపుడు గుర్తులేదు) ఎత్తుకు పోయేడని పంతులికి చెప్పేడు చలపతి. పంతులూ, చలపతీ కూడా మా నాన్న చావు గురించీ, పంతులుగాడి బావ గురించీ చాలా సైంటిఫిక్‌గా పెద్దాస్పత్రిలో డాక్టర్లు ఏ పేషెంటు ఎందుకు చచ్చిపోయేడో చెప్పుకున్నట్టు చెప్పుకున్నారు.

ఆ తరవాత. "నీకింకేం కావాలోయ్ మిస్టర్ వెంకటసత్యమ్" అని అడిగేడు చలపతి.

పోనీ, మా అమ్మ అయినా వెయ్యేళ్లు బతుకుతుందా అని అడుగుదాం అనుకున్నాను. కాని బతకదని అతను ఎక్కడ చెప్పేస్తాడో అని భయపడి అడగటం మానీసేను.

అటుపిమ్మట నా జాతకం చదివి చాలా విషయాలు చెప్పేడు చలపతి. వివరాలు నాకు సరిగా జ్ఞాపకం లేదు. నేను ఇంజనీర్‌ని అవుతానని కాబోలు చెప్పాడు. నేను ఇంజనీరింగు ఆఫీసులో గుమాస్తాగా మాత్రం పనిచేసేను. నాకు పాతికో యేట పెళ్లవుతుందనీ, ఆ పెళ్లాం చచ్చిపోతుందనీ చెప్పేడని నాకు గుర్తు. నాకు పాతికోయేట పెళ్లి అవవలసిందే మా మేనమామ కూతురితో. కాని, మా మేనమామ దాన్ని "ఏ మంగలాడికైనా యిచ్చి చేస్తాను కాని వాడి కివ్వను" అన్నాట్ట. "మంగలాడికైనా" అని ఎందుకన్నాడో నాకు ఇప్పటికీ అర్థం కాదు. కాని, ఇంతలో మా మామకూతురు టైఫాయిడ్ పట్టుకొని చచ్చిపోయింది. నాకు మరింక మరో పదేళ్లకి కాని పెళ్లి కాలేదు. నాకు తొమ్మండుగురు సంతానం ఉంటుందన్నాడు చలపతి. ఉందురేమో?! కాని, ముగ్గుర్లోనూ ఒకడు చచ్చిపోయేడు. ఇద్దరు కూతుళ్లే ఉన్నారు, ముందుకి ఎవరు పుడతారో, ఎవరుంటారో ఏమి చెప్పగలం? మరికొందరు జ్యోతిష శాస్త్రజ్ఞులు మరికొన్ని సంఖ్యలు చెప్పేరు నా సంతానం గురించి.

చలపతి ఏమేమి ఆనాడు చెప్పాడో నాకు సరిగా గుర్తులేదు. కాని నా భవిష్యత్తు సుమారుగా ఉంటుందని మాత్రం చెప్పేడు. నన్ను చాలా గ్లూమీ మూడ్‌లో పెట్టేడు. ఒక్కటి మాత్రం కొంత ఉత్సాహకరమైన విషయం చెప్పేడు. "పీక్కోసినా సరే నువ్వెవణ్నీ దేహీ అని ముష్టెత్తవు" అన్నాడు. అందుకు మట్టుకు నేను కొంత సంతోషించేను.

ఆరాత్రి నేను పార్కునించి ఇంటికి వెళ్లేసరికి తొమ్మిది గంటలయింది. కొంచెం నిస్పృహతో "ఇదిగో అమ్మా జాతక చక్రం" అని ఆ కాయితం మా బట్టల పెట్టెమీద పడేసేను.

అప్పుడు చెప్పింది మా అమ్మ అది నా జాతకం కాదట. మా పెద్దనాన్న కొడుకు వెంకట సత్యందిట. వాడు నాకంటే ఓ రోజు పెద్దట. నేను ద్వాదశినాడు పుడితే, వాడు ఏకాదశినాడు పుట్టేట్ట. పేరొకటే ఉంటే అదే నీదనుకున్నావ్రా అంది మా అమ్మ.

మా పెదనాన్న ఫకీరైపోయి ఆ రోజుల్లోనే మా ఇంట్లోనే చచ్చిపోయేడు. అతని కొడుకు వెంకటసత్యం పుట్టిన ఆరో నెలలో మంచం కింది కుంపటి వేడికి పట్టెడ ముట్టుకోగా కాలిపోయి చచ్చిపోయేడట.

వెంకటసత్యం చావు, నా బతుకునీ తల్చుకొని నేను నిట్టూర్చేను. ఇప్పటికీ నేను నిట్టూరుస్తూనే ఉన్నాను. కాని మరోలా లేను. "ముష్టెత్తవు!" అన్నాడు చలపతి. అదైనా నిజమైతే, బావుండుననిపిస్తూంటుంది నాకు! కాని, "అయ్యో అది నా జాతకం కాదుకదా?" అని భయం వేస్తూంటుంది. ఆరో నెలలో కాలి చచ్చినవాడే ఎంతో అదృష్టవంతుడు, నాకంటే అని పిస్తూంటుంది.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక, 25-10-1968*